జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 23-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 256 పేజీలు: 4 వెల : రూ.7



## దేవదేవుడు.. వాసుదేవుడు

* పొన్నచెట్టు వాహనంపై ఊరేగిన వాసుదేవుడు
* భక్తి, శ్రద్ధలతో శ్రీకృష్ణ పూజ * నేత్రపర్వం.. తెప్పోత్సవం

**మందస, ఫిబ్రవరి 22(వార్త):** వాసుదేవుని కల్యాణ ఘడియలను భక్తులు కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం జరిగే స్వామి వివాహమహోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మాండనాయకుడైన వాసుదేవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కనులపండువగా జరుగుతున్నాయి. మందస పట్టణంలో వేంచేసిన శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం పొన్నచెట్టు వాహనసేవ, శ్రీవాసుదేవపూజ, తెప్పోత్సవం, అశ్వవాహనసేవ, దోపిడి ఉత్సవం కనులపండువగా జరిగాయి. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని నిర్వాహకులు అందజేశారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గౌతు శ్యామసుందర శివాజీ, విజయలక్ష్మి దంపతులు వాసుదేవుని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### శ్రీమన్నారాయణుడు.. సర్వంతర్యామి..

శ్రీమన్నారాయణుడు సర్వంతర్యామి అని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. స్వామి పొన్నచెట్టు వాహనసేవ అనంతరం భక్తులనుద్దేశించి ప్రసంగించారు. స్వామిని పూజిస్తే సర్వ పాపాలు హరిస్తాయని, భగవంతుని సేవలో భక్తులు తరించాలని, భగవంతునికి నిర్ణీత రూపం లేదని, వాక్కు, మనస్సునకు అందని అతీతుడని అభివర్ణించారు. స్వామివారు సంగీత ప్రియుడని, ఎక్కడ వీనులవిందైన కీర్తనలు వింటారో అక్కడే ఉంటారన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన భక్తి కీర్తనలకు భక్తులు భక్తి పారవశ్యం చెందారు. ఈ కళాకారులను ఘనంగా సన్మానించారు.

### వైభవంగా స్వామి తెప్పోత్సవం..

శ్రీవాసుదేవుని తెప్పోత్సవం ప్రతీఏటా బ్రహ్మోత్సవాల్లో గోపాలసాగరంలో జరుగుతుంది. స్వామివారు పొన్నచెట్టు వాహనరూఢుడై ఉభయ దేవేరులతో తెప్పలో జలవిహారం చేశారు. అంతకు ముందు గోపాలసాగరం ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు.





## తండేల్ సినిమా రచయిత కార్తిక్.. మోసం చేశాడు

* రామారావు.. తండేల్ కాదు * అతడి వల్లే పాకిస్థాన్‌కు దొరికిపోయాం
* మా కథాంశంతో చిత్రం నిర్మించి మమ్మల్ని అగౌరవపరుస్తున్నారు
* మీడియా సమావేశంలో మత్స్యకారుల ఆవేదన

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** తండేల్ సినిమాలో చూపించినట్లుగా రియల్ తండేల్ రామారావు కాదని, పాకిస్తాన్‌కు దొరికిన మూడు బోట్లలో ముగ్గురు తండేల్‌లు ఉన్నారని బాధిత మత్స్యకారులు వాపోయారు. నగరంలోని ఎన్‌జీవో హోంలో గతంలో పాకిస్తాన్ నావికాదళాలకు చిక్కిన మత్స్యకార కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచయిత కార్తీక్ తమ గ్రామాలకు వచ్చి మీరు సముద్రంలో వేట సమయంలో పడే ఇబ్బందులు, పాకిస్తాన్ పోలీసులకు చిక్కి 14 నెలలు పాటు పడిన కష్టాలను కథా వృత్తాంతంతో చిత్రం నిర్మిస్తున్నామని మీరు ఈ కథ మరెవరికీ చెప్పవద్దని చెబుతూ 21 కుటుంబాలకు చెందిన మాకు చెరోరూ.45 వేలు చొప్పున అందజేశారన్నారు. అలాగే గణగళ్ల రామారావు, ఎర్రయ్యలకు చెరో రూ.90 వేలు చొప్పున అందించారని తెలిపారు. అయితే హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కు కేవలం నలుగురిని మాత్రమే తీసుకు వెళ్లారని, మిగిలిన వారి గురించి చిత్రయూనిట్ అడగ్గా వారు వలస వెళ్లిపోయారని అందుబాటులో లేరని రామారావు యూనిట్ సభ్యులకు అబద్ధం చెప్పాడని వెల్లడించారు. శ్రీకాకుళంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో తమను సన్మానిస్తామని చెప్పిన కనీసం వేదిక కూడా ఎక్కనివ్వకుండా రచయిత కార్తీక్, రామారావులు అడ్డుపడ్డారన్నారు. తమను రామారావు, రచయిత కార్తీక్‌లు మోసం చేశారన్నారు. శ్రీదేవి డ్రామా కంపెనీ తమ మత్స్యకారుల ఇబ్బందులను తెలుసుకునేందుకు కబురు పంపిస్తే ఎవరికీ సమాచారం ఇవ్వకుండా రామారావు, ఆయన భార్యే వెళ్లిపోయారని ఇది సబబు కాదన్నారు. రామారావు కారణంగానే తామంతా ఆనాడు పాకిస్తాన్ పోలీసులకు దొరికిపోయామన్నారు. సినిమా యూనిట్ రామారావుకు రూ.20 లక్షలు నగదుతో పాటు ఒక ఇంటిని కూడా కట్టించి ఇస్తున్నట్టు ప్రచారం సాగుతోందని, ఇది నిజమైతే తమకు కూడా ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో చీకటి గురుమూర్తి, సూరాడ ముగతమ్మ, కోనాడ వెంకటలక్ష్మీ, కె. అప్పారావు, కిషోర్, పి మణి, రాజు, భవిరోడు, గురువులు, వి శ్యామ్యూల్, బడే అప్పన్న, వెంకటేష్‌లు పాల్గొన్నారు.



## విద్యార్థి ఆత్మహత్య



**పలాస, ఫిబ్రవరి 22 (వార్త):** తల్లిదండ్రులు మందలించారని ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని శివాజీ నగర్ కాలనీకి చెందిన బి.యశ్వంత్ (17) ఈ నెల 20న తల్లిదండ్రులకు చెప్పకుండా ఒడిశాలో ఓ వివాహానికి వెళ్లాడు. పరీక్షలుండగా వివాహానికి ఎందుకెళ్లావని తల్లిదండ్రులు బాలుడిని మందలించారు. 21వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లిన యశ్వంత్ తిరిగి ఇంటికా రాలేదు. దీంతో కుటుంబీకులు స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ వెదికారు. కోసంగిపురం జాతీయ రహదారి కూడలి కాలనీలో ఓ ఇంటి వద్ద ఉరి వేసుకొని విగత జీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సూర్యనారాయణ తెలిపారు.

## గంజాయి స్వాధీనం

**టెక్కలి, ఫిబ్రవరి 22 (వార్త):** టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో బొరిగిపేట గ్రామ పరిధిలో ఉన్న మామిడి తోటలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకే సీఐ విజయ్ కుమార్ సిబ్బందితో వచ్చి 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 8 కేజీల గంజాయి, నాలుగు ద్విచక్ర వాహనాలు, 9 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ తరలించామని సీఐ తెలిపారు.



# 26 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

**సారవకోట, ఫిబ్రవరి 22(వార్త):** సారవకోటలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల 26 నుంచి జరుగుతాయని మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్ తెలిపారు. మండలాధీశ్వర స్వామి యాత్ర మహోత్సవం సందర్భంగా ఈ టోర్నమెంటు నిర్వహించడం జరిగిందని ఇందులో ఆసక్తిగల వాలీబాల్ టీం లో పాల్గొనాలని ఆయన కోరారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ దివ్య తృతీయ బహుమతులు అధిక స్థాయిలో ఉంటుందని తెలిపారు. ఈ టోర్నమెంటు డే ఎన్ మ్యాచ్ గా నిర్వహిస్తామని వచ్చిన ఆటగాళ్లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు

# సెకీతో విద్యుత్ ఒప్పందం చరిత్రాత్మకం

**-ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్**



**వంగర, ఫిబ్రవరి 22(వార్త):** సెకి విద్యుత్ ఒప్పందంపై ఏఆర్ఆర్ నివేదిక జగన్ పరిపాలనకు మచ్చు తునకని, 7వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందం చారిత్రాత్మకం నిజమైన సంపద సృష్టి జగన్ తోనే సాధ్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం వంగర మండలంలోని ఇరువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సందర్శించి పూజల అనంతరం ఆయన మాట్లాడారు. పచ్చ మీడియా కథనాలకు ఏ ఆర్ ఆర్ తీర్పు చెంప పెట్టన్నారు . కోర్టు ఇచ్చిన తీర్పు జగన్ పరిపాలన తీరుకో అద్దం పట్టిందన్నారు శక్తి ఒప్పందంపై లేనిపోని అపోహలు కట్టుకథలు కల్పించారనే ఈ నివేదికతో ఇవేవీ వాస్తవం కాదని రుజువయిందన్నారు. సత్యాన్ని ఎప్పుడూ దాచలేరన్నారు. శక్తి ఒప్పందం ఒక చారిత్రాత్మక నిర్ణయమైనా నిజమైన సంపద సృష్టి ఇటువంటి ఒప్పందాలతోనే సాధ్యమని తెలిపారు. చరిత్రలో 7000 మెగావాట్ల విద్యుత్కు సంబంధించి ఇటువంటి నిర్ణయాలు ఇప్పుడు ఎక్కడ జరగలేదన్నారు .ఈ ఒప్పందంలో ఎటువంటి అవకతవకలు లేవని , విద్యుత్ ఎంత చౌకగా కొనుగోలు చేసిన ఒప్పందం ఏదైనా ఉంటే అది జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే సేకి అనేశక్తి సంస్థతో చేసుకున్న ఒప్పందమే ఒకటేనని ఆయన ఘంటాపదంగా చెప్పారు. పరిపాలన చేతకాక గత ప్రభుత్వంపై ప్రతి తప్పును నెట్టివేయాలన్నా కూటమి ప్రభుత్వం కుట్రలో ఇది ఒక భాగమని ఆయన తెలిపారు. దీనికి వంతు పాడుతు పచ్చి మీడియా అసత్యాలను వండి వార్చుతోందనే ఆయన ఆరోపించారు. ఆయనతోపాటు ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, జడ్పిటిసి ప్రతినిధి కరణం సుదర్శన్రావు, వీరఘట్టాం ఎంపీపీ దమ్మలపాటి వెంకటరమణనాయుడు, వైసిపి నాయకులు బొంతు వెంకట్రావు, సూర్యనారాయణ, విజయమ్మ, విజయలక్ష్మి, రిటైర్డ్ టీచర్ మరిశర్ల గంగారావు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మను గెలిపించండి



**పలాస, ఫిబ్రవరి 22(వార్త):** ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా రఘువర్మను గెలిపించాలని కోరుతూ ఏపీటీపీటిసి చైర్మన్ వజ్జ బాబూరావు ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలు మేరకు కూటమి అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నట్లు బాబూరావు ప్రకటించారు. ఈ మేరకు పలాస మున్సిపాలిటీ పరిధిలోని మదర్ తెరిసా విద్యాలయం, విద్యా వాహిని కళాశాల తో పాటు శ్రీ గురుకుల విద్యాలయం అలాగే పలాస ప్రభుత్వ హై స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కలిసి మీ ఓటును అభ్యర్థి రఘువర్మకు అనుకూలంగా వేయాలని వజ్జ బాబు రావు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామ నాయుడు తో పాటు, ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు సతీమణి గంగా భవాని, గురుకుల ప్రిన్సిపాల్ కే అశోక్ వర్ధన్,సాసుమాను చంద్రమౌళి, జగదీష్ పంద తదితరులు పాల్గొన్నారు.



**వంగర, ఫిబ్రవరి 22(వార్త):** ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వము బలపరచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అఖండ మెజారిటీ తో గెలిపించవలిసింది గా శనివారం వంగర మండలంలోని అరశాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , మద్దువలస జూనియర్ కాలేజీ, వంగర కేజీబీవీ, వివేక్ మాస్టర్ మైండ్ స్కూల్ లో గల ఉపాధ్యాయ ఓటర్స్ ను టీడీపీ నాయకులు కోరారు. కార్య క్రమం లో మండల తెలుగు దేశం పార్టీ అద్యక్షులు పిన్నింటి మోహన్ రావు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు లచ్చుభుక్త క్రిష్ణ మూర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి , బెజ్జిపురపు రవి తదితరులు పాల్గొని కోరారు.

# పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్



**-నేడు, రేపు అధికారులంతా పంచాయతీల్లోనే**

**-జిల్లా పంచాయితీ అధికారి భారతి సౌజన్య**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు డీపీవో కె. భారతి సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో అధికారులంతా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఉదయం 6 గంటలకే అధికారులంతా పంచాయతీల్లో విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండురోజుల్లో వంద శాతం చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్త కుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్ పక్కన పశువుల పేడదిబ్బలు తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పేర్కొన్నారు. సేకరించిన చెత్త సేకరణ వివరాలను పీఆర్ ఆన్లైన్ యాప్లో నమోదు చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు.



# పలాసలో పారిశుధ్యానికి పెద్దపీట

**పలాస, ఫిబ్రవరి 22(వార్త):** పలాస మున్సిపాలిటీని చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని తన లక్ష్యమని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుఅన్నారు. పలాస మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు పరిశీలించి పారిశుధ్యం కార్మికులకు శనివారం తగు సూచనలు చేశారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారి పారిశుధ్య పనులు పరిశీలనలో భాగంగా కాశీబుగ్గ 17వ వార్డు ఎంపీడీఓ ఆఫీస్ రోడ్ లో స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించారు. కాశీబుగ్గ 13 వ వార్డు, కూరగాయలు బజార్లో చిరు వ్యాపారస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కాశీబుగ్గ, 14వ వార్డు, కే టి రోడ్లో శానిటేషన్ ను పరిశీలించి, కాశీబుగ్గ రైల్వే క్వార్టర్స్ 9వ వార్డ్ వెంకటేశ్వర కాలనీ లో శానిటేషన్ పరిస్థితిని పరిశీలించారు. పలాస, 28వ వార్డు, ఉదయపురం గొడగల వీధిలో కాలువ పరిస్థితిని పరిశీలించి, నీటి ప్రవాహానికి చెత్త చెదారం తక్షణమే తొలగించవలసిందిగా పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. 4వ వార్డు పద్మనాభపురం కాలనీలో 4వ లైన్ లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ను పై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లు ఉదయపాత్రో, వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్ లో గల అన్న క్యాంటీన్, రోజువారి ఇన్స్పెక్షన్స్ లలో భాగంగా ఈరోజు కూడా బ్రేక్ ఫాస్ట్ టైం లో ఇన్స్పెక్ట్ చేయడం జరిగినది. టిఫిన్స్ గాని, ప్యూరిఫై డ్రింకింగ్ వాటర్ గానీ, క్వాలిటీ-క్వాంటిటీ గాని, వెలుపల-బయట శానిటేషన్ గాని బాగున్నాయి అని, పబ్లిక్ ఫీడ్ బ్యాక్ కూడా బాగుందని చెప్పారు.

# ఆశి లక్ష్మి ప్రియాంకకు డాక్టరేట్ ప్రదానం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(వార్త):** ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని ఆశి లక్ష్మీప్రియాంక డాక్టరేట్ అందుకున్నారు. రోల్ ఆఫ్ ఏఐ పవర్డ్ స్మార్ట్ స్పీకర్స్ ఇన్ షేపింగ్ ఈ - కస్టమర్స్ బిహేవియర్ అండ్ పర్చేజింగ్ పాటర్న్ - ఏ స్టడీ ఆన్ సెలెక్ట్ సిటీస్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్, ఇండియా అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.ఉమాదేవి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఈమె విజయనగరంలోని సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు.ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు ప్రొసీడింగ్స్ ఇచ్చి అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ ప్రిన్సిపాళ్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తోటి పరిశోధకులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన

**వంగర, ఫిబ్రవరి 22(వార్త):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని డిఆర్ఓ పరిశీలించారు. అనంతరం వంగర మండలం అధికారులకు ఎన్నిక పట్ల కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయనతోపాటు తాసిల్దార్ డి ధర్మరాజు, ఏవో టీ కన్నబాబు, ఎస్సై షేక్ శంకర్, ఎంఈఓ టు కే జగదీశ్వరి, ఎమ్మార్వై రామారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 27న సెలవు : కలెక్టర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా ఉన్న కేంద్ర/ రాష్ట ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజైన ఫిబ్రవరి 27వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘ ఉత్తర్వుల మేరకు ప్రత్యేక సాధారణ సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్) మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే పై ఎన్నికలకు ఓటు హక్కు కలిగి ఉన్న ప్రైవేట్ యాజమాన్యాలు/ సంస్థలలో పని చేస్తున్న వారి ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలను మంజూరు చేయాలని తెలిపారు. పోలింగ్ రోజున (ఫిబ్రవరి 27) వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతి లేదా షిఫ్ట్‌ల సర్దుబాట్లు, తక్కువ సమయం డ్యూటీ గంటలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.



## కమిషనర్‌కి మున్సిపల్ కార్మికుల వినతి

**పలాస, ఫిబ్రవరి 22 (వార్త):** పెండింగ్ లో ఉన్న తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమీషనర్ ఎన్ రామారావుకి మున్సిపల్ శానిటేషన్ కార్మికులు వినతి పత్రం శనివారం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలనుండి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీనివల్ల మున్సిపల్ పరిధిలో పనిచేయడం కూడా కష్టం అవుతున్నదని కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, యూనియన్ ప్రతినిధులు సి హెచ్ మురగన్, కె వెంకటి, బి కుర్మారావు లు తెలిపారు. తక్షణమే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**డిమాండ్స్ ఇవే:**

1) చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని
2) పని ముట్లు ఇవ్వాలి. పాడైనా తోపుడు బండ్లు రిపేరు చెయ్యాలని
3) మున్సిపాలిటీలో తగిన శానిటేషన్ వర్కర్స్ ను భర్తీ చేయాలని
4) పెండింగ్ లో ఉన్న పి యఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలలో జమ చేయాలని
5) ఆప్ కాస్ రద్దు నేపథ్యంలో కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని
6) పని కాంట్రాక్టు కు ఇవ్వాలనే ఆలోచన విరమించాలని
7) గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని
8) ఇచ్చిన జి ఓ ప్రకారం పండగ బోనస్ వెయ్యి రూపాయలు చెల్లించాలని
9)కార్మికులు చనిపోయిన సందర్బంలో దహనసంస్కారం ఖర్చులు ఇప్పించాలని
10)సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. దీనిపై సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

కార్యక్రమంలో యం రవి, తిరుపతి, బాలక్రిష్ణ, కె ఈశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ప్రాంతీయ నిఘా మరియు అమలు అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం విజయనగరం జిల్లాలో గల 6 పెట్రోల్ బంకులను విజిలెన్స్ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా అధికారులు ఆరిణాం అక్కివలస గ్రామంలో ఉన్న బీపీసిల్ బంకు, అల్లినగరం లో నయార బంకు, కుశాలపురం లో శ్రీనివాస మణికంఠ ఆయిల్స్, విజయనగరం జిల్లాలో డెంకాడ గ్రామంలో సత్యసాయి ఫిల్లింగ్ స్టేషన్, జొన్నాడ గ్రామం లో మార్తాండ ఏజెన్సీ, విజయనగర పట్టణం లో తిరుమల సత్యదేవ్ ట్రేడర్స్ తనిఖీలు చేసారు. తనిఖీలలో స్టాకు నిల్వలు, నాణ్యతా ప్రమాణాలు, రీడింగ్ లోపాల గూర్చి నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ బి ప్రసాద రావు మాట్లాడుతూ బంకుల్లో జరిగే అక్రమాలపై నిఘా ఉంచామని, పట్టుబడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులతో పాటు సంబంధిత సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.




# తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పిన లహరి

**-ఆకట్టుకున్న ప్రముఖుల ప్రసంగాలు**

**-మాతృభాష గొప్పతనాన్ని వివరించిన వక్తలు**

**-అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

**-కె.నారాయణ హైస్కూల్‌లో ఘనంగా వేడుకలు**








**మందస, ఫిబ్రవరి 22(వార్త):** తెలుగు భాష వైభవాన్ని చాటి చెప్పేలా, మాతృభాషలోని గొప్పతనాన్ని యువతకు అర్థమయ్యేలా చేయడానికి మందస మండలంలోని కుంటికోట గ్రామంలో గల కె.నారాయణ హైస్కూల్ లో అత్యంత వైభవంగా "తెలుగు లహరి" కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా సంబరాలతో నిండిపోయింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అతిథులు భారీ సంఖ్యలో హాజరై ఈ వేడుకను మరింత ప్రాముఖ్యతను చేకూర్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్, గ్రూప్-1, 2016 బ్యాచ్, విజయనగరంలో పనిచేస్తున్న బమ్మిడి శ్రీనాథుడు విద్యార్థులకు భాషా సంస్కృతి మీద అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. "తెలుగు భాషలోని తియ్యతనం, గొప్ప సాహిత్యం, సాంస్కృతిక వారసత్వం మనందరిది. ఈ సంపదను కాపాడటం మన బాధ్యత" అన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు చూసి ముచ్చటపడి, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని నిర్వహించాలని సూచించారు. ప్రధాన అతిథిగా డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పాల్గొని, "తెలుగు భాషను మననం చేసుకోవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ మన జీవితంలో అంతర్భాగంగా మార్చుకోవాలి" అంటూ స్పష్టమైన సందేశాన్ని అందించారు. విద్యార్థులు చదువుతో పాటు భాషాభిమానాన్ని పెంచుకోవాలని, తమ రచనా ప్రతిభను బయట పెట్టాలని ప్రోత్సహించారు.

విశిష్ట అతిథులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ (డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం), ఎం. లక్ష్మణరావు(ఎంఈఓ, మందస), సిహెచ్. శ్రీనివాసరావు గారు (ఎంఈఓ, పలాస), శ్రీ ఎన్. తారకేశ్వరరావు(ఎంఈఓ, మందస) సిహెచ్. సత్యం (ఎంఈఓ, పలాస) హాజరై, భాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషలో శాస్త్రీయత ఉన్నట్లు కూడా వివరించడంతోపాటు, సాహిత్య సమృద్ధి, దశదిశలా తెలుగు భాషను వ్యాపింపచేసిన గొప్ప కవులు, రచయితల గురించి వివరించారు. గౌరవ అతిథులుగా జి.సత్యమణి(కరస్పాండెంట్, సూర్య స్కూల్, రణస్థలం), ఎం.వైకుంఠ రావు(కరస్పాండెంట్, చాణుక్య పబ్లిక్ స్కూల్, పోలాకి), పి.వి.ప్రతాప్ కుమార్(కరస్పాండెంట్, ఎస్వీఎస్ స్కూల్, ఆముదాలవలస), బద్రి కూర్మారావు(రిటైర్డ్ లెక్చరర్, జానపద కళల పరిశోధకుడు) కార్యక్రమంలో పాల్గొని, భాషా పరిరక్షణలో భాగస్వామ్యం అవ్వాలని విద్యార్థులకు ఉద్బోధించారు. "మన భాష గొప్పదనాన్ని మనం గుర్తించుకోకపోతే, ఇతరులు గుర్తించరు. భాషాభిమానంతో పాటు, పుస్తకపఠనం అలవర్చుకోవడం, సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవడం అవసరం" అని చెప్పారు.కార్యక్రమంలో తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించే అనేక నృత్యాలు, నాటకాలు, గేయాలు, కళా ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా "తెలుగు వెలుగు" నాటకం పాఠశాల విద్యార్థుల ద్వారా ప్రదర్శించబడింది, ఇది తెలుగు భాష మహత్యాన్ని తెలియజేసే గొప్ప కళారూపంగా నిలిచింది. విద్యార్థులచే ప్రదర్శించబడిన "తప్పెటగుళ్లు" సంప్రదాయ కళారూపం ప్రేక్షకులను అలరించింది. విద్యార్థుల హుషారైన ప్రదర్శన, ఆవేశపూరిత మేళతాళాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. "థింసా నృత్యం" ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబిస్తూ, భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని అందంగా ప్రతిబింబించింది. పాఠశాల విద్యార్థులు సముదాయంగా తెలుగు పద్యాల పారాయణం చేసి, మహా కవుల కీర్తిని చాటి చెప్పేలా చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ జి.రోహిణి శంకర్ ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమం విజయవంతం కావడానికి విశేషంగా సహకరించారు. ఈ వేడుక ద్వారా విద్యార్థుల్లో తెలుగు భాషపై మరింత గౌరవభావం, మమకారం పెరుగుతుందనే నమ్మకాన్ని పాఠశాల వ్యక్తం చేసింది. ఈ తరహా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని డైరక్టర్లు గుంట బుద్ధ సూర్య, అరవింద్ నారాయణన్ స్పష్టం చేసారు.

# గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా డ్రోన్ కెమెరా తో క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నిఘా ఏర్పాటు పెట్టడం జరిగింది. నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్న జిల్లా పోలీసులు. శనివారం శ్రీకాకుళం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్, కాశీబుగ్గ పోలీసు స్టేషను పరిధిలో నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం,పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట , జూదం తడితర నేరాలు పై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.ప్రత్యేకంగా పాడుపడిపోయిన ఇల్లు, నివాస గృహాలు పై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం జరిగింది.బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం,గంజాయి వినియోగం చేసిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ,ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి వినియోగించిన పేకాట ఈవ్ టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కు పాల్పడినవారు పట్టుబడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ప్లాస్టిక్ భూతాన్ని సమూలంగా నిర్మూలిద్దాం

**-విక్రయిస్తే జైలు శిక్ష**

**-మార్చి 1 నుంచి నిషేధం**

**-పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు**



**పలాస, ఫిబ్రవరి 22(వార్త):** ప్లాస్టిక్ ను సమూలంగా నిర్మలిద్దామని, ప్లాస్టిక్ విక్రయిస్తే నే జైలు శిక్ష అని పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు హెచ్చరించారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘము కార్యాలయంలో శనివారం పురపాలక సంఘంలోని వ్యాపారస్తులుతో కిరాణా షాప్ యజమానులు, పాన్ షాప్ యజమానులు, చికెన్ షాప్ యజమానులు, ప్లాస్టిక్ అమె అన్ని షాపుల యజమానులతో మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడుక వలన మన పురపాలక సంఘము ప్రజలందరి ఆరోగ్యం దృష్ట్యా ప్రజలను చైతన్యవంతం పరచడానికి మీరు కూడా మీ వంతు కృషిగా ప్లాస్టిక్ కవర్ లు కొనడానికి ఎవరైనా వచ్చిన, అమ్మడం లేదని మీరు గుడ్డ సంచులు తీసుకొని రావాలని చెప్పవలసిందిగా కోరారు. ప్లాస్టిక్ అమ్మకాలుతో ఎవరైనా వ్యాపారస్తులు దొరికినట్లయితే వారికి ప్రభుత్వం వారు 3 సంవత్సరములు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించబడునని హెచ్చరించారు. ప్లాస్టిక్ ను పూర్తిగా తొలగించి నట్లయితే పర్యావరణంతో పాటు మన ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని, ఈ పురపాలక సంఘములో గల ప్రజలలో మీరు కూడా భాగస్వాములు కనుక ప్లాస్టిక్ ని పూర్తిగా రూపుమాపడానికి మీరందరూ కూడా పూర్తిగా సహకరించాలని కమీషనర్ కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మార్చి 1, 2025 తేదీ నుండి ప్లాస్టిక్ అమ్మకాలను పూర్తిగా నిషేధించుతామని వ్యాపారస్తులందరితో మున్సిపల్ కమిషనర్ ప్రమాణం చేయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకటేష్, ఉదయ్ పాత్రో , శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ

**పలాస, ఫిబ్రవరి 22(వార్త) :** క్షేత్ర స్థాయిలో నేరాలు నియంత్రణకు డ్రోన్ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయని కాశీబుగ్గ డి.ఎస్.పి వి.వెంకట అప్పారావు అన్నారు. శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో డ్రోన్ కెమెరాలతో పరిసరాలను పరిశీలించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ఓపెన్ డ్రింకింగ్, గంజాయి వినియోగం, రవాణా, పేకాట నిర్వాహణ వంటి అంసంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు. డ్రోన్ వినియోగంపై స్థానిక సిబ్బందికి శిక్షణ ఇచ్చి వారికి అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. శాంతి భద్రతల కు విఘాతం లేకుండా చేస్తామని అన్నారు.



# పారదర్శకంగా షెడ్యూల్డ్ కులాల జనగణన జరిపించాలి

**- కలెక్టర్‌ను కోరిన దళిత సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు**

**- బాబా సాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏప్రిల్ 14లోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** షెడ్యూల్డ్ కులముల జాబితాలో ఉన్న కులాల జన గణన పారదర్శకంగా జరిపించాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు కోరారు. జిల్లా కలెక్టర్‌ను వారు కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వంలో తప్పులతడకగా జరిగిన ఎస్సీ కులాల జనాభా ఆధారంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని చూస్తున్నట్లుగా ఉందని, ఎస్.సి కులాల జనగణన పారదర్శకంగా పూర్తి చేసిన తర్వాతనే వర్గీకరణపై దృష్టి పెట్టాలని వారు కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల అంబేద్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనులను బాబాసాహెబ్ జయంతి ఏప్రిల్ 14లోపు పూర్తి చేసేలా చూడాలని వారు జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేసారు. శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి అంబేద్కర్స్ కాంస్య విగ్రహ పనులు పూర్తి చేసేలా చూస్తామని జిల్లా కలెక్టర్ దళిత సంఘాల జెఏసి నేతలకి తెలియజేసారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జెఏసి నేతలు తైక్వాండో శ్రీను,డా.కంఠ వేణు మాట్లాడుతూ రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా సుప్రీం కోర్టు షెడ్యూల్డ్ కులాలను వర్గీకరించాలని తీర్పును ఇచ్చిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శిస్తుందని ధ్వజమెత్తారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ను నియమించి వర్గీకరణను త్వరితగతిన చేయాలని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయాల వారీగా నవశకం లబ్ధిదారుల కోసం ఎస్సీ కులాల జనాభా గణనను చేసినా అపారదర్శకంగా దాన్ని అప్పట్లో చేసారని ఆరోపించారు. ఇప్పుడు ఆ లెక్కలను తీసుకుని కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సిద్దపడటం సరి కాదని తెలిపారు. పారదర్శకంగా ఎస్సీ కులాల జన గణనను పూర్తి చేసిన తర్వాతనే వర్గీకరణ కోసం ముందుకు వెళ్లాలని డిమాండ్ చేసారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను కలసి వినతిపత్రం అందజేసినట్లుగా వారు పేర్కొన్నారు. అలాగే బాబా సాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం నిధులు మంజూరయ్యాయని, ప్లాన్ ను రెఢీ చేసారని పనులు జరుగని విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళినట్లుగా తెలియజేసారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి జరుగనున్న దృష్ట్యా ఆ లోగా పనులు పూర్తి చేసేలా చూడాలని కోరినట్లుగా తెలియజేసారు.

# ఘనంగా మాజీ మంత్రి సీదిరి జన్మదిన వేడుకలు







**పలాస, ఫిబ్రవరి 22(వార్త):** మాజీ మంత్రి, పేదల పెన్నిధి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలాస ప్రగతి భవన్ వద్ద వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన ఘనముగా వేడుకలు నిర్వహించారు. .అనంతరం మాజీ మంత్రి జన్మదినోత్సవం పురస్కరించుకుని పలాస ప్రభుత్వఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. పలాస ముత్యాలమ్మ కోనేరు వద్ద గల శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద మాజీ మంత్రి పేరు మీద వైస్సార్సీపీ పట్టణ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే ఆలయం వద్ద మాజీ మంత్రి పేరు మీద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షులుశిస్టు గోపి, వైస్సార్సీపి కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు, మాజీ మంత్రి అభిమానులు పాల్గొన్నారు.

**మందస, ఫిబ్రవరి 22(వార్త):** పలాస నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత డాక్టర్ సీదిరి అప్పలరాజని పలువురు వక్తలు అన్నారు. మందస పట్టణంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేకుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్దే ద్యేయంగా పని చేసి అన్ని వర్గాల ప్రజల, రైతుల ఆదరాభిమానాలను అప్పలరాజు పొందారన్నారు. ఎంఎల్ఏ, మంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని ఏ నాయకుడు కూడా చేయలేదన్నారు. మండల కేంద్రమైన మందసతో పాటు మండలాన్ని, పలాస నియోజక వర్గాన్ని గత వైసిపి ప్రభుత్వ పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో అభివృద్ధికి డాక్టర్ సిదిరి అప్పలరాజు ఎంతో కృషి చేశారని వారు కొనియాడారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పలరాజు తప్పక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. ఈసారి ఉప ముఖ్యమంత్రి పదవి కూడా వరిస్తుందన్నారు. జనం గుండెల్లో ఆయనకు ఎప్పటికీ ప్రత్యేక స్తానం ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకి రావు రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు దల్లి జానకీరావు రెడ్డి బర్త్ డే కేక్ ను కట్ చేసారు. ఈ సందర్భంగా ఆసుపత్రులలో పాలు పండ్లు, రొట్టెలు రోగులకు అందించారు. ప్రజలకు స్వీట్లు పంచారు. అనంతరం శ్రీవాసు దేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య ఆధ్వర్యంలో బహడపల్లిలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైసీపీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, సీనియర్ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, గౌడు కురా, శానాపతి కిశోర్ కుమార్, ఎంపీటీసీ కంచి బెహరా, కర్రి గోపాలకృష్ణ, చింతాడ గణపతి, మద్దిల రామారావు, సిందిరి జగన్, సర్పంచ్ ప్రతినిధి సీహెచ్ లక్ష్మణమూర్తి, పార్టీ కార్యకర్తలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(వార్త):** నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం చాలా ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెట్‌శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సి ఇ ఒ) బి వి ప్రసాదరావు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె వెంకట్ ఉజ్వల్ పాల్గొని ప్రారంభించారు. వాలీబాల్ కబాడీ బ్యాడ్మింటన్ 100 మీటర్స్ రన్నింగ్ పోటీలు నిర్వహించడమైనది. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు సర్టిఫికెట్స్ అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా క్రీడాధికారి సంస్థ అధికారి శ్రీధర్ రావు, నెహ్రూ యువ కేంద్ర గణాంకధికారి కార్యక్రమం సహాయకులు డి శ్రీనివాసరావు, కోచ్ లు, మూలపేట వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు గుజ్జల ఉమామహేశ్వరరావు, ఝూన్సీ అగ్రికల్చర్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతీ మోహన్‌రావు నెహ్రూ యువ కేంద్ర ఎన్.వై.వి లు తదితరేలు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ మొదటి బహుమతి రాజేశ్వరి రెండవ బహుమతి జి. శరణ్య , అథ్లెటిక్స్ మహిళలు: మొదటి బహుమతి సిహెచ్ భార్గవి, రెండవ బహుమతి బి హారిక, అథ్లెటిక్స్ పురుషులు: మొదటి బహుమతి టి యోగేశ్వరరావు రెండవ బహుమతి జి శంకర్ , కబాడీ మొదటి బహుమతి గార కె శంకర్ టీమ్ రెండవ బహుమతి పవన్ కుమార్ టీమ్ , వాలీబాల్ మొదటి బహుమతి మందస బి సాయి రాఘవేంద్ర, రెండవ బహుమతి గార ఏ రాజేష్ టీం.





## లొహరిబంద డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

**మందస, ఫిబ్రవరి 22(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న షేక్ ఖాధర్ బుఖారీ సస్పెండ్ కు గురయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారులు నుంచి మందస మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. సచివాలయం పరిధిలో సర్వీస్ చార్జ్ అమౌంట్ రూ.96వేలు సంబంధిత ఖాతాలకు ఆయన జమ లేదని, దీంతో డిజిటల్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు. కాగా ఈ విషయాన్ని స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి బూరగాన ఋషీశ్వరరావు వద్ద ప్రస్తావించగా, ఉత్తర్వులు అందాయన్నారు.

## పక్కా పథకంతో మందసలో చోరీ

**-సీసీ కెమేరాలో ధ్వంసం చేసి మరీ దొంగతనం**

**-తాళాలు విరగ్గొట్టి రూ.2లక్షలకు నగదు ఎత్తుకెళ్లిన దొంగలు**



**మందస, ఫిబ్రవరి 22(వార్త):** మందస పట్టణంలో దొంగతనం జరిగింది. పక్కా ప్రణాళికతో దొంగలు దొంగతనం చేశారు. చోరీ చేసిన వారు అన్ని విషయాలు తెలుసుకుని, దొంగతనం చేసినట్టు స్పష్టమవుతోంది. వివరాలిలా ఉన్నాయి. మందస బస్టాండ్కు కూత వేటు దూరంలో సాయికమల్ బిల్డింగ్ మెటీరియల్ షాపు ఉంది. షాపునకు పక్కాగా రక్షణ చర్యలను యజమానులు తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా సీసీ కెమేరాలు కూడా ఏర్పాటు చేశారు. కానీ, వీటన్నింటిని గుట్టుగా ఎవరో గమనిస్తూ, చోరీకి పాల్పడ్డారు. మరో విషయం ఏమిటంటే.. కౌంటర్ అరుదుగా నగదును ఉంచుతారు. ఎప్పుడు ఉంచుతారో.. ఎప్పుడు ఉంచరో.. యజమానికే తెలియదు. అటువంటి తరుణంలో శుక్రవారం రూ.2లక్షలకు పైగా నగదు ఉంచారన్న వివరాలు ఎలా బయటకు వెళ్లాయో తెలియదు కానీ, షాపు వెనుకభాగం నుంచి దొంగలు ప్రవేశించినట్టు అనుమానిస్తున్నారు. తాళాలు బద్దలు గొట్టి, కొన్ని సీసీ కెమేరాలకు వైర్లు కట్ చేసి, మరికొన్నింటిని ధ్వంసం చేశారు. లోపలకు ప్రవేశించిన దొంగలు రూ. 2 లక్షలకు పైగా నగదుతో పాటు ఓ ల్యాప్ ట్యాప్ కూడా దొంగలించారు. సీసీ కెమేరా హార్డిస్కను కూడా ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే షాపు తెరవడానికి వెళ్లిన యజమానికి తాళాలు బద్దలు గొట్టి ఉండడంతో ఇప్పిలి వెంకటేశ్వరరావు, మద్ది నవీన్ కుమార్ మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం రప్పించారు. కాగా, దొంగలు తెలివిగా ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు పెయింట్లో కలిపే టిన్నర్ అనే రసాయినాన్ని సంఘటనా స్థలంలో చల్లినట్టు తెలుస్తోంది. స్థానికులు ఉదయాన్నే చేరుకుని, నిర్ఘాంత పోయారు. శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాల కళ్యాణం కావడంతో అర్థరాత్రి దాటిన వరకు కూడా భక్తులు తిరుగుతున్నారు. ఈ సమయంలోనే ఎలా దొంగలు దొంగలించారో అర్థంకావడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. మందస పట్టణంలో జరిగిన ఈ సంఘటన సంచలనంగా మారింది.

## గంజాయి కేసులలో నేరస్థులకు.. శిక్ష పడేలా దర్యాప్తు చేయాలి

**విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22(వార్త):** గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాల కేసులలో పటిష్టంగా దర్యాప్తు చేపట్టి శిక్ష పడేలా చూడాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో చట్టపరమైన నిబంధనలు, పాటించవలసిన నియమాలు, నైపుణ్యం పై ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రంగధామ్ అవగాహన కల్పించారు. అనంతరం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గంజాయి రవాణా, వ్యాపారస్తులు మూలాలు కనిపెట్టాలన్నారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఎన్డిపిఎస్ కేసుల దర్యాప్తులో పాటించవలసిన జాగ్రత్తలు, నిబంధనలు, నైపుణ్యం పెంపొందించుకునేందుకు ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా ఈనెల 14,15 తేదీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాలో, రెండో విడతగా 21,22 తేదీల్లో అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలోను ఈవర్క్ షాప్ జరగగా, విశాఖపట్నం రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, అనకాపల్లి, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇప్పటివరకు చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అనుభవం గల పోలీసు అధికారులు కేసులు నమోదు చేయడంలో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. గంజాయి కేసులలో పట్టుబడిన నేరస్థులు ఆస్తులు జప్తునకు చట్ట ప్రకారం ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ సమగ్రంగా చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల కేసులలో చట్టప్రకారం నియమ, నిబంధనలు పాటిస్తూ కేసులు దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ఈ వర్క్ షాప్‌లో అదనపు ఎస్పీ కేవీ రమణ, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురాన, డీఎస్పీలు వీవీ అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాద్‌రావు, ఎం.రాంబాబు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546